క్లుప్తంగా

అన్నదానాన్ని ప్రారంభించిన దొరబాబు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పాత్రుల్లపేట సత్తెమ్మ ఆలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు అమ్మవారిని దర్శించుకుని, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు,

ఘనంగా సీతారాముల రథోత్సవం

గొల్లప్రోలు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాములు రథోత్సవానికి సోమవారం రాత్రి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో సీతారాములు రథోత్సవాన్ని సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, గొల్లప్రోలు పోలీసులు, ఎస్సై బాలాజీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తాగునీరు అందక ఇబ్బంది

కొత్తపల్లి: కొండెవరం శివారు కాశివారి పాకలలో గత వారం రోజులుగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వాకతిప్ప శివారులో ఉన్న రక్షిత మంచి నీటి పథకం నుంచి కాశివారి పాకలలో ఉన్న సంపులోకి చేరి అక్కడ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకుకు దాని నుంచి గ్రామానికి సరఫరా అవుతుంది. అయితే మోటారు మరమ్మతులు గురవడంతో సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు నిర్వహించి తాగు నీరు అందించాలని కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీటిపై పలువురు మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో తాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన పైపులైన్లు, తాగునీటి పథకంలో మోటార్ల మరమ్మతులకు గురైనా త్వరితగతిన బాగుజేయలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సంధ్య, విద్యుత్ శాఖ ఏఈ ప్రమోద్, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం

సామర్లకోట: మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం సోమవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో సాగింది. ఆలయంలో ఈ నెల 18 నుంచి కల్యాణ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉదయం స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా స్టేషన్ సెంటర్, చిన్నవీధి, పెద్దవీధి, మఠంసెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరులో గ్రామోత్సవం నిర్వహించి రాత్రికి ఆలయానికి చేరింది.

చలివేంద్రం ప్రారంభం

సామర్లకోట: స్టేట్ బ్యాంకు ఎదురుగా సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ప్రారంభించారు. దీనిని ఏర్పాటు చేసిన అబంటి సుబ్బన్న ఆయిల్ వారిని ఆయన అభినందించారు. సంస్థ భాగస్వామి సింగవరపు హరినాథరావు జ్ఞాపకార్థం ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రతినిధులు సి.సాయిబాబు, తులసీధర్, సత్యనారాయణ తెలిపారు.

ప్లాస్టిక్‌తో మానవాళికి ముప్పు

కాకినాడ సిటీ: ప్లాస్టిక్ కాలుష్యంతో మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ హైస్కూల్‌లో ర్యాలీ నిర్వహించారు.

పిఠాపురంలో ఫ్యాన్ హోరు

- అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేసిన వంగా గీత
- పిఠాపురం తరలి వచ్చిన అశేష జనవాహిని



అశేష జనవాహినితో నామినేషన్ వేసేందుకు వస్తున్న వంగా గీత

పిఠాపురం: ఎటు చూసినా జనం.. ఏ నోట విన్నా జై వైఎస్సార్ సీపీ, జై వంగా గీత అంటూ నినాదాలతో సోమవారం పిఠాపురం మార్మోగింది. పిఠాపురం నియోజకవర్గంలో ఫ్యాన్ గుర్తు సునామి సృష్టించింది. ఎక్కడికక్కడ వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిశాయి. అశేష జనం, వేలాది మంది అభిమానుల మధ్య వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వంగా గీత సోమవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. తొలుత పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె ప్రత్యేక వాహనంపై పార్టీ కార్యాలయం నుంచి పార్టీ కేడర్‌తో కలిసి ర్యాలీగా కోటగుమ్మం సెంటర్, చర్చి సెంటర్, స్టేట్‌బ్యాంకు సెంటర్, ఉప్పాడ సెంటర్ పాదగయ సెంటర్ల మీదుగా పిఠాపురం ఎన్నికల ప్రధాన కార్యాలయానికి చేరుకుని తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అడుగడుగునా పట్టణ ప్రజలు ఆమె కాన్వాయికి ఘన స్వాగతం పలుకుతూ నీరాజనాలు పలికారు. దారిలో కోటగుమ్మం ఎంటర్ వద్ద జై గణేష్ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు, చర్చి సెంటర్లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, అంబేడ్కర్ సెంటర్ వద్ద



సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీత

మసీదులో ప్రత్యేక ప్రార్థనలతో చేసిన తర్వాత ఆమె పిఠాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి చేరుకుని రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు పిఠాపురం నియోజకవర్గ ప్రజల దీవెనలతో తాను ఎమ్మెల్యేగా గెలుపు సాధించి సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీగా తాను చేసిన అభివృద్ధికి ప్రధాన కారణం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఆయన ఆదేశాలతో ఎమ్మెల్యేగా పోటీలో ఉన్నానన్నారు. ఆయన అండతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఆమె వెంట ఆమె భర్త విశ్వనాథ్, ఎమ్మెల్యే పెండెం దొరబాబు, రావుల మాధవరావు తదితరులున్నారు.

పిఠాపురం తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొత్తపల్లి: పిఠాపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత సోమవారం నామినేషన్ వేశారు. ఆమె నామినేషన్‌కు మద్దతుగా మండలంలోని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో–ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరుల ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

నాగులపల్లి నుంచి భారీగా తరలిన నాయకులు

కొత్తపల్లి: పిఠాపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత సోమవారం నామినేషన్ వేశారు. ఆమె నామినేషన్‌కు మద్దతుగా మండలంలోని నాగులపల్లి నుంచి వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు.

భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

గొల్లప్రోలు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత నామినేషన్‌కు మద్దతుగా మండలం, పట్టణం నుంచ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, మండల పార్టీ అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, గంద్రేటి శ్రీరామ చంద్ర మూర్తి, మొగలి బాబ్జీ, మొగలి అయ్యారావు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు తరలివెళ్లారు.



చేబ్రోలు నుంచి భారీగా బయలుదేరిన పార్టీ నాయకులు



నాగులపల్లి నుంచి భారీ ర్యాలీగా...

సెంటిమెంట్‌గా క్వాలిస్ కారు, ఎర్ర చీర



ఎరుపు రంగు చీరలో నామినేషన్ వేసేందుకు వస్తున్న వంగా గీత

తన రాజకీయ జీవితంలో ఎప్పుడు నామినేషన్లకు ఇతర పదవులకు వెళ్లే సమయంలో ఎరుపు రంగు చీర ధరించడం ఆమెకు సెంటిమెంట్‌గా వస్తోంది. ఎప్పటిలాగే ఎర్ర రంగు చీరను ధరించి ఆమె నామినేషన్ వేశారు. ఏటా దుర్గా భవానీ మాల ధరించేటప్పుడు వేసుకునే ఆ చీరను తనకు అత్యంత విలువైన సమయాల్లో మాత్రమే వేస్తుంటారు. తన రాజకీయ ఆరంగేట్రంలో కొన్న 999 నంబరు గల క్వాలిస్ కారును ఆమె సెంటిమెంటుగా భావిస్తారు. అదే కారులో ఇప్పటి వరకు అన్ని పదవులకు ఆమె నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పుడు అదే కారులో వచ్చి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇటీవల 999 నంబరుతో మరో కొత్త వాహనం కొని ఉపయోగిస్తున్నప్పటికి దానిని పక్కన పెట్టి సెంటిమెంటుగా ఉన్న పాత కారులోనే ఆమె రావడం విశేషం.

మంచి కోరే మమ్మల్ని ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు
- సతీమణి చంద్రకళతో కలిసి ఎన్నికల ప్రచారం



పెద్దాపురంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న దొరబాబు, చంద్రకళ దంపతులు



పట్టణంలో పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న దొరబాబు

పెద్దాపురం: నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం, మంచి కోరేందుకే ప్రజల ముందుకు వచ్చామని, తమను ఆశీర్వదించాలంటూ వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, ఆయన సతీమణి చంద్రకళ కోరారు. పట్టణంలోని 24, 26 వార్డుల్లో దొరబాబు దంపతులు సోమవారం రాత్రి మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ.. మీలో ఒక్కడిగా, స్థానికుడిగా, నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన తనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ తనను ఆదరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. స్థానికుడైన తనను ఎమ్మెల్యేగా, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడి రాజశేఖర్, కౌన్సిలర్లు విడదాసరి రాజా, గడపా శివ, టౌన్ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా వైఎస్సార్ సీపీలో చేరిక

స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన సుమారు వంద కుటుంబాల వారు సోమవారం రాత్రి పెద్దాపురం పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, తాడి రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు.

పదో తరగతి పరీక్షల్లో 75 శాతం ఉత్తీర్ణత

మండల టాపర్ యండపల్లి – 581



గ్రంధి వెంకట పవన్ | కొల్లా జ్యోతిర్లింగ వెంకట రామ | దరబాల వెంకట సత్య

కొత్తపల్లి: పదో తరగితి పరీక్ష ఫలితాల్లో మండలం 75 ఉత్తీర్ణత శాతన్ని సాధించినట్టు మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల సోమవారం తెలిపారు. 875 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుగాకా 652 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వాకతిప్పలో 96 మంది విద్యార్థులకు 73 మంది ఉత్తీర్ణత సాధించాగా 73 శాతం, కొత్తపల్లి బాలికల పాఠశాల నుంచి 137 మందికి 97 మంది పాస్ కాగా 71 శాతం లభించిందన్నారు. కొత్తపల్లి బాలురు పాఠశాలలో 117 మందికి 60 మంది, 51 శాతం, కొమరగిరిలో 78 మంది విద్యార్థులకుగా 63 మంది ఉత్తీర్ణత సాధించగా 81 శాతం సాధించారన్నారు. కొండెవరంలో 87 మందికి 64 మంది ఉత్తీర్ణత సాధించగా 74శాతం, ఎండపల్లి 41మందికి 37 మందికి 90 శాతం వచ్చిందని తెలిపారు. మూలపేట 149మందికి 124 మంది ఉత్తీర్ణత సాధించగా 83 శాతం, కోనపాపపేట 82 మందికి 64 మంది ఉత్తీర్ణత సాధించగా 78 శాతం, రమణక్కపేట 11మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. నాగులాపల్లి తెలుగు మీడియం 32 మందికి 20 మంది ఉత్తీర్ణత సాధించగా 63శాతం, నాగులాపల్లి ఇంగ్లీషు మీడియం 45 మందికి 39మంది ఉత్తీర్ణత సాధించగా 87శాతం వచ్చిందని తెలిపారు. వీరిలో యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి గ్రంధి వెంకట పవన్ 581మార్కులు సాధించి ప్రథమ స్థానం, కోమరగిరి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి కొల్లా జ్యోతిర్లింగ వెంకటరామ 578 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన దరబాల వెంకట సత్య 577 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచినట్టు ఎంఈఓ తెలిపారు.

నలుగురు నామినేషన్ల దాఖలు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి నిమ్మకాయల చినరాజప్ప రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేయగా, ఆయన తనయడు రంగనాగ్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ వేశారు. సామర్లకోటకు చెందిన జైభీమ్ రావు భారత్ పార్టీకి చెందిన బుంగా సత్యనారాయణ ఒక సెట్, మరో స్వతంత్ర అభ్యర్థి మోటుపల్లి శివకుమార్ రెండు సెట్ల నామినేషన్లను ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావుకు అందజేశారు.

సామర్లకోట: అంతకుముందు అచ్చంపేటలో చినరాజప్ప తన స్వగృహం నుంచి బైక్ ర్యాలీతో ఉండూరు, సామర్లకోట నుంచి పెద్దాపురం తరలి వెళ్లారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురంలో రెండు నామినేషన్లు

పిఠాపురం: నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన ఐదో రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికి మూడు రోజుల పాటు ఏ ఒక్కరూ కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధికారులు ఖాళీగా ఉన్నారు. అయితే అభ్యర్థులు తమతమ నామినేషన్ల దాఖలుకు ముహూర్తాలు చూసుకోవడం వల్లే ఇప్పటి వరకు నామినేషన్లు పడలేదని అధికారులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో సోమవారం ఐదో రోజు వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి జగ్గారపు మల్లికార్జున ఇద్దరు అభ్యర్థులు నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ నామినేషన్ వేయనున్నారు.

టెన్త్‌లో 75 శాతం ఉత్తీర్ణత



పి.హర్షిణి | కట్టా మౌనిక | సూరంపూడి విజయ | రాసపల్లి విజయలక్ష్మి

సామర్లకోట: పదో తరగతి ఫలితాల్లో మండలంలో విద్యార్థులు 75.1 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ వై శివ రామకృష్ణయ్య తెలిపారు. తెలుగు మీడియంలో 312 మందికి 177 మంది పాసై, 56.7 శాతం, ఇంగ్లిష్ మీడియంలో 783 మందికి 645 పాసై 82.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పి.హర్షిణి 579 మార్కు లతో ప్రథమ స్థానం సాధించినట్టు తెలిపారు, వేట్లపాలెం జెడ్పీకి చెందిన కట్టా మౌనిక 578, సూరంపూడి విజయ 578, ఉండూరు జెడ్పీకి రాసపల్లి విజయలక్ష్మి 577, బీబీఆర్ హైస్కూల్‌కు చెందిన ఎస్ అమృతవర్షిణి 576 మార్కులు సాధించారని వివరించారు.

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



గోనెల షణ్ముఖేశ్వర్ | గొల్లపల్లి అంజన | పేరూరి వినయ్

గొల్లప్రోలు: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. గొల్లప్రోలు పట్టణం, మండలంలో 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 753 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 640 మంది ఉత్తీర్ణులవ్వగా 85 శాతం పాస్ నమోదైంది. తెలుగు మీడియం 249 మంది పరీక్షలు రాయగా 173 మంది, ఇంగ్లీష్ మీడియం 504 మంది పరీక్షలు రాయగా 467 మంది ఉత్తీర్ణులయ్యారు. గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొనెల షణ్ముఖేశ్వర్ 587 మార్కులు, తాడిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొల్లపల్లి అంజన 585 మార్కులు, చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పేరూరి వినయ్ 581 మార్కులు సాధించారని ఎంఈఓ వెంకట శివప్రసాద్ తెలియజేశారు.

మండల టాపర్‌గా కొండపల్లి విద్యార్థిని

పెద్దాపురం: కొండపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వానపల్లి గౌరీజ్యోతి పదో తరగతి ఫలితాల్లో 584 మార్కులు పొంది మండల టాపర్‌గా నిలిచినట్టు ఎంఈఓ ప్రభాకరశర్మ తెలిపారు. మండలంలో మొత్తం 1,591 మంది పరీక్షలు రాయగా, 1,226 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 77.06 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు.



గొర్రెల మహాలక్ష్మి | దేవు తేజో అమృత

పిఠాపురం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. పిఠాపురం పట్టణానికి సంబంధించి 12 ప్రభుత్వ పాఠశాలలో 585 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 470 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 80శాతం ఉత్తీర్ణత వచ్చింది. పిఠాపురం రూరల్‌లో 10 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 543 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 456 పాసై 83శాతం సాధించారు. పిఠాపురం పట్టణంలో ఉన్న మున్సిపల్ పాఠశాలకు చెందిన గొర్రెల మహాలక్ష్మి 584, దేవు తేజో అమృత 582 మార్కులు సాధించారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



మేడపాడులో రంగనాయకులును కలిసి మద్దతు తెలిపిన వలంటీర్లు

సామర్లకోట: మండలంలోని జి.మేడపాడు గ్రామానికి చెందిన రెండు సచివాలయాల్లోని 69 మంది వలంటీర్లు మూకుమ్మడిగా సోమవారం రాజీనామాలు చేశారు. తమ రాజీనామాలను పంచాయతీ కార్యదర్శి టీఎస్ రామ్‌ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎవరితో మాట్లాడినా కొంత మంది వీడియోలు, ఫొటోలు తీస్తున్నారని, దాంతో రాజీనామాలు చేశామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వలంటీర్లుగా చేరామని, ప్రతిపక్షాల కుట్రలతో విధులకు దూరం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రజలకు స్వేచ్ఛగా సేవలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు విజయానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కాకినాడ జెడ్పీ అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులును కలిసి తమ మద్దతు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు సోమవారం స్వచ్ఛందగా రాజీనామా చేశారు. మండలంలోని ఉప్పాడ–5, యండపల్లి–2, కోమరగిరి–2, నాగులపల్లి–1, ఇసుకపల్లి–8 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. తమ రాజీనామ పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పదో తరగతి ఫలితాలు రావడంతో విద్యార్థులు ఆలయంలో స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజలు చేశారు. భక్తులకు అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ జరిగింది.

వాహనాల తనిఖీలో నగదు స్వాధీనం

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అధికారులు సోమవారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. అనుమతి లేకుండా కలిగిఉన్న రూ.58,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు తెలిపారు. సామర్లకోట–కాకినాడ రోడ్డులో సాంబమూర్తి రిజర్వాయర్ ఎస్ఎస్‌టీ చెక్కు పోస్టు వద్ద టీం అధికారి విజయ్‌కిరణ్ తనిఖీలు చేపట్టారు.

కారులో ప్రయాణిస్తున్న బి.విజయతులసి వద్ద నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో ఆ నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించినట్టు చెక్ పోస్టు అధికారులు తెలిపారు.

నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేయండి

జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్

కాకినాడ సిటీ: ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు (ఎస్ఎస్‌టీ) ముమ్మర తనిఖీలు చేసి, నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సీజర్ మేనేజ్‌మెంట్, ఎంసీసీ, సీ విజిల్ యాప్ ఫిర్యాదులు తదితర అంశాలపై జిల్లాలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలకు సంబంధించి కాకినాడ జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, ఇతర నోడల్ అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.17.94 కోట్ల విలువైన మద్యం, నగదు, ఇతర సామగ్రిని సీజ్ చేశారన్నారు. ఇందులో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాల ద్వారా రూ.13.48 కోట్లు సీజ్ చేసినట్టు చెప్పారు. ఆయా బృందాలు సమన్వయంతో పని చేసి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. నగదు, లిక్కర్, ఇతర వస్తువులు సీజ్ చేసినప్పుడు నిష్పక్షపాతంగా వ్యవహరించి, ధైర్యంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. సీజర్ రిపోర్టులను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల వాహనాలకు జీపీఎస్ అమర్చినట్టు చెప్పారు. ఆయా బృందాల పనితీరుపై అధికారులు నిత్యం పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల చివరి రోజుల్లో చురుగ్గా వ్యవహరించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.